సాక్షి
వనపర్తి
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



బీఆర్‌ఎస్‌ను గద్దెదించాలి
రాష్ట్రాన్ని దోచుకుంటున్న బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలని ఆకునూరి మురళి అన్నారు.
వివరాలు 8లో ▸



ఆరోగ్యం పదిలం
వ్యాయామం చేయడం, ఆహారపు అలవాట్లలో మార్పులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /24.1
వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళలలో ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది.

ఇఫ్తార్ 6-37
(శుక్రవారం సాయంత్రం)
సహర్ 4-46
(శనివారం తెల్లవారుజామున)
రంజాన్ వేళలు



సలేశ్వరం వద్ద లోయలోకి దిగుతున్న భక్తులు



నల్లమల అటవీ ప్రాంతంలో జనం పాదయాత్ర



ఇరుకైన దారిలో ప్రమాదకరంగా ఇలా..

వనమంతా.. జనసంద్రం

సలేశ్వరానికి పోటెత్తిన భక్తజనం

- రెండోరోజు 2 లక్షలకుపైగా భక్తుల రాక
- విపరీతమైన రద్దీతో లింగమయ్యను దర్శించుకోకుండానే వెనక్కి..
- భద్రతా లోపం, తొక్కిసలాటతో భక్తుల ఉక్కిరిబిక్కిరి
- సౌకర్యాల కల్పనలో విఫలమైన అధికార యంత్రాంగం

సాక్షి, నాగర్‌కర్నూల్/అచ్చంపేట/మన్ననూర్/లింగాల: సలేశ్వరం ఉత్సవాల సందర్భంగా నల్లమల భక్తులతో జనసంద్రంగా మారింది. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిలోని ఫర్హాబాద్ చౌరస్తా మొదలుకొని దారి పొడవునా ఎక్కడ చూసినా భక్తులు, వాహనాల రాకపోకలతో అడవి మొత్తం కిక్కిరిసిపోయింది. 'వస్తున్నాం.. లింగమయ్య' అన్న భక్తుల నినాదాలతో కొండలు, కోనలు, లోయలు, సెలయేర్లు మార్మోగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బుధవారం మొదటిరోజు లక్ష మందికిపైగా లింగమయ్యను దర్శించుకున్నారు. రెండోరోజు గురువారం పౌర్ణమి కలిసిరావడంతో దాదాపు 2 లక్షల మంది భక్తులు సలేశ్వరం చేరుకున్నట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తుంది.



సలేశ్వర క్షేత్రం వద్ద కిక్కిరిసిన భక్తజనం

లింగమయ్య దర్శనం కోసం వచ్చి జనం తాకిడి తట్టుకోలేక ఇద్దరు భక్తులు మృత్యువాతపడ్డారు. అటవీశాఖ అధికారుల అడ్డగోలు నిబంధనలు, భక్తులు ఒక్కసారిగా తరలిరావడంతో ఊపిరాడక రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌కు చెందిన విజయ(40) మృతిచెందగా.. నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లకు చెందిన చంద్రయ్య(55) గుండెపోటుతో మృతిచెందాడు. కాగా.. భయంకరమైన లోయల ప్రాంతంలో భద్రత ఏర్పాట్లు లేవు. భక్తుల భద్రత కోసం ఇనుప చువ్వలతో భద్రత వలయం ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడాఎవరికీ కలగడం లేదు.

ఏటా ప్రమాదాలు జరుగుతున్నా.. చర్యలు శూన్యం

సలేశ్వరం క్షేత్రంలో ప్రమాదాల బారినపడి ప్రతి ఏటా భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. 2010లో ఒకరు, 2011లో ఇద్దరు, 2012లో ఇద్దరు, 2015లో ఒకరు, 2017లో ఇద్దరు మృత్యువాతపడ్డారు. 2022లో సలేశ్వరం కొండల్లో అకాల వర్షాలకు కొండ చరియలు విరిగి ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తాజా ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





బండరాళ్లు దాటుకుంటూ వస్తున్న భక్తులు

అడుగడుగునా వైఫల్యమే..

అడవి మార్గంలో చీమలదండులా వాహనాలు బారులుతీరాయి. ఉదయం 8 గంటల నుంచే ఫర్హాబాద్ చెక్‌పోస్టు నుంచి పుల్లాయిపల్లి వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వాహనాలు ముందుకు కదలడానికి 3 గంటలకుపైగా సమయం పట్టింది. ఫర్హాబాద్ నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరిన భక్తులు సాయంత్రం 7 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఇక్కడినుంచి మూడు, నాలుగు గంటల్లో వచ్చే అవకాశం ఉన్నా.. భక్తుల రద్దీ కారణంగా 12 గంటల సమయం పట్టింది. అలాగే అతి కష్టం మీద లింగమయ్య వద్దకు చేరుకున్న భక్తులకు దర్శనానికి మరో 6 గంటలకుపైగా పట్టింది. లింగమయ్య ఆలయానికి చేరుకోవడానికి కి.మీ. ముందు నుంచే భక్తులు క్యూకట్టారు. వచ్చీపోయే భక్తులకు ఒకేమార్గం ఉండటంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో కిక్కిరించిన జనంతో సలేశ్వరం తీర్థం వద్ద లోయలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి వేచి చూస్తూ కొందరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. ఓపిక నశించిన కొంత భక్తులు లింగమయ్య దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగారు. మరికొందరు ముందుకు వెళ్లేందుకు సాహసం చేయగా తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఊపిరాడక ఒకరు, గుండెపోటుతో మరొకరు మృతిచెందగా.. తొక్కిసలాటలో మరో వ్యక్తి మృతి చెందినట్లు తెలిసింది. కానీ, అధికారులు రిపోర్టు చేయలేదు. మృతదేహాలను అటవీ సిబ్బంది, పోలీసులు చెంచుల సహకారంతో అతి కష్టం మీద బయటికి తరలించారు. చిన్నచిన్న జాతర్లపై సమీక్షలు నిర్వహించి భారీ బందోబస్తు కల్పించే ప్రభుత్వం.. ప్రమాదకరమైన లోయల్లో మాత్రం ఐదుగురు సిబ్బందితోనే సరిపెట్టడం విమర్శలకు తావిస్తోంది. పెద్దమొత్తంలో తరలివచ్చిన భక్తులను అదుపు చేయలేక పోలీసులు, అటవీ సిబ్బంది చేతులెత్తేశారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పడంతో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సులను గంటల తరబడి కదలకుండా అటవీశాఖ అధికారులు నిలిపివేయడంతో ఎండవేడిమికి ప్రయాణికులు నరకయాతన అనుభవించారు.



ఫర్హాబాద్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

గడువు పెంచే అవకాశం?

సలేశ్వరానికి పెరిగిన భక్తులను దృష్టిలో ఉంచుకుని మరో రెండు రోజులపాటు ఉత్సవాలను పొడిగించే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గడువు పెంచితే శుక్రవారం కొంతమేర జనం తగ్గే అవకాశం ఉంది. అధికారులు గతంలో మాదిరిగా 24 గంటల పాటు భక్తులను అనుమతించాలని కోరుతున్నారు. గడువు పెంపుపై నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధికారులతో సమీక్షించినట్లు తెలిసింది.

■ లింగాల మండలంలోని నల్లమల లోతట్టు ప్రాంతంలో వెలసిన సలేశ్వర క్షేత్రానికి వెళ్లే భక్తుల సంఖ్య అప్పాయపల్లి మార్గంలో ఈసారి గణనీయంగా పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి లింగాలకు చేరుకుంటున్న భక్తులు ట్రాక్టర్లు, జీపులు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో అప్పాయపల్లి మీదుగా గిరిజగుండాల వరకు తరలివెళ్తున్నారు.

ఎలాంటి ఏర్పాట్లు లేవు..



సలేశ్వరం ఉత్సవాల్లో లోయ వద్ద భక్తుల కోసం అటవీ శాఖ ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. పోలీసు శాఖ భద్రతను పర్యవేక్షించడంలో విఫలమైంది. భక్తులు గంటల తరబడి నరకయాతన అనుభవించాం. అటవీ శాఖ టోల్‌గేట్ల వద్ద వసూళ్లపై పెట్టిన శ్రద్ధ కనీస సౌకర్యాలు కల్పించడంలో చూపించలేదు.

– మల్లేశ్, అడ్వకేట్, హైదరాబాద్

నరకప్రాయమే..

సలేశ్వరం వెళ్లే క్రమంలో ఎవరైనా ప్రమాదానికి గురైనా, మృత్యువాత పడినా నరకయాతన అనుభవించాల్సిందే. చెంచుల సహాయంతో మోకాళ్ల పర్వతం కొండపైకి తీసుకువచ్చిన తర్వాత రాంపూర్ చెంచుపెంట నుంచి వాహన సదుపాయం ఉంటుంది. అక్కడి దాకా మనుషులు, కర్రల సహాయంతో మృతదేహాన్ని తీసుకొస్తారు. గుండం చుట్టూ ఇనుప కంచె, జలపాతం, ఇరుకైన కొండ చరియల ప్రాంతంలో రేలింగ్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. లోయలో దిగే ప్రాంతంలో మెట్లు సైతం లేవు. భక్తులు తడిచిన దుస్తులతో లోయలో దిగే ప్రాంతంలో రాకపోకలు సాగించడం వల్ల దారి బురదగా మారి కాళ్లు జారి కిందపడుతున్నారు. ఇలాంటి ప్రాంతంలో మెట్లు ఎంతో అవసరం ఉన్నా ఇటు అటవీ శాఖ గాని, అటు ఆలయ కమిటీ, ప్రభుత్వ యంత్రాంగం ఎవరూ పట్టించుకోవడం లేదు. సలేశ్వరం క్షేత్రానికి ఉన్నతాధికారులు సైతం వచ్చి వెళ్లినా ఇక్కడి పరిస్థితులు మాత్రం మారడం లేదు.



కొండచరియలు పట్టుకొని పైకి వస్తున్న యువకులు

న్యూస్‌రీల్

అంకితభావంతో పనిచేయాలి



చిన్నంబావి: పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎస్పీ రక్షిత కే మూర్తి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం చిన్నంబావి పోలీస్ స్టేషన్‌ను ఆమె పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు వివరాలు, రోజువారీ ఫిర్యాదులను ఎస్‌ఐ వస్తం నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చట్టాలను న్యాయబద్ధంగా అమలు చేయాలని, వాటిని పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. మండలంలో అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే తనిఖీలు చేయాలని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలు నివారించాలని, స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డీఎస్పీ ఆనంద్ రెడ్డి, కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కొత్తకోట రూరల్/పెబ్బేరు: సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని, అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. బీజేపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పెబ్బేరు, పెద్దమందడిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు.

పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ చేరాలి

తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో కేంద్ర క్యాబినెట్‌లో 27 మంది ఓబీసీలకు స్థానం, బీసీ కులాలకు నీట్, నవోదయ, సైనిక స్కూల్, రిజర్వేషన్లు, 150 కులవృత్తులకు సంవత్సరానికి రూ.50 కోట్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగిందని ఆమె అన్నారు. పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంతో మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి చేరేవిధంగా కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, బి.కృష్ణ, ప్రతాప్, ఎస్.వెంకట్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, నాగేంద్ర యాదవ్, రామకృష్ణారెడ్డి, బుడ్డన్న, కృష్ణయ్య, నారాయణరెడ్డి, రమేష్, వేమారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాపాయం నుంచి రక్షణ

పెబ్బేరు: గుండె పోటు వచ్చినపుడు సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని జిల్లా శిక్షణ వైద్య అధికారి డాక్టర్ శ్రీహరినాథ్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. వయస్సుతో నిమిత్తం లేకుండా గుండెపోటుతో ఎక్కువ మంది మృతి చెందుతున్నారని, అలాంటి మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం సీపీఆర్ సేవలు అందిస్తోందన్నారు. సీపీఆర్ శిక్షణతో 50శాతం గుండెపోటు మరణాలను తగ్గించవచ్చన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించడంతో సరైన చికిత్స అందడంతో వారు బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, డాక్టర్ రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



వనపర్తిలో రోడ్డు విస్తరణ పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

వనపర్తి టౌన్: అధికారుల సమష్టితోనే వనపర్తిని అభివృద్ధి వైపు నడిపేందుకు సాధ్యపడుతుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ప్రజల వివిధ ప్రదర్శనల కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు అనువుగా ఉండే టౌన్ హాల్ భవన నిర్మాణ, ఫ్లోరింగ్, కలరింగ్, విద్యుత్, తాగునీరు, శానిటేషన్, గ్రీనరీ, తదితర పనులను ఆయన పరిశీలించారు. వనపర్తిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, టౌన్ హాల్ ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలు కలిగిన జిల్లా వనపర్తి అని ప్రజలు చెప్పుకునేలా, రాష్ట్రంలోనే ముందుంచేలా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో రోడ్ల విస్తరణ పనులపై ఆరా తీశారు. వా రం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్ విక్రమసింహా రెడ్డి, ఈఈ దేశ్యనాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రామన్‌పాడ్ పంపుహౌస్ పనులు వేగవంతం

గోపాల్‌పేట: వీలైనంత త్వగా రామన్‌పాడ్ పంప్ హౌస్ పనులు పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం పనులను పరిశీలించారు. నెల క్రితం వచ్చి చూసినప్పటికీ ప్రస్తుతం ఏమేర పనులు పూర్తి చేశారని అక్కడి మిషన్ భగీరథ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని ఆదేశించారు. ఆయనతోపాటు మిషన్ బగీరథ ఉన్నతాధికారులు ఈఈ మేఘారెడ్డి, డీఈ విజయ్‌కుమార్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

కనులపండువగా హనుమాన్ శోభాయాత్ర



వనపర్తిలో హనుమాన్ శోభాయాత్ర

వనపర్తి క్రైం: హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన శోభయాత్ర బాలనగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. శివాజీ మహరాజ్, ఆంజనేయ స్వామి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శోభయాత్రలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, ఎంపీపీ మేఘారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, బి.కృష్ణ, నారాయణ, కార్యదర్శి పరశురాం, రాంమ్మోహన్, శివకృష్ణ తదితరులు ఉన్నారు. ఏఎస్పీ షాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐలు యుగంధర్ రెడ్డి, రాములు బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో 'పది' పరీక్షలు



గోపాల్‌పేటలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్



ఆత్మకూర్ పరీక్ష కేంద్రం వద్ద డీఈఓ రవీందర్, డీపీఓ సురేష్

వనపర్తి టౌన్/పెబ్బేరు/గోపాల్‌పేట/అమరచింత/మదనాపూర్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పదో తరగతి పునాది అని, పరీక్షలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ రక్షిత కే మూర్తి, అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, డీఈఓ రవీందర్ సూచించారు. గురువారం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వారు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పూర్తి వివరాలిలా.. జిల్లా కేంద్రంలోని చాణక్య హైస్కూల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని, కొత్తకోటలోని నివేదిత హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, ప్రతి పరీక్ష కేంద్రల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని పరీక్షల నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు.

99.63శాతం హాజరు

జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 7,055 మందికిగాను 7,029 మంది విద్యార్థులు హాజరయ్యారు. 26 మంది గైర్హాజరు కాగా.. మొత్తంగా 99.63శాతం హాజరు శాతం నమోదైంది.

■ పెబ్బేరులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ రక్షిత కే మూర్తి పరిశీలించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, కేంద్రాల సమీపంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

■ గోపాల్‌పేటలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సునిత ఉన్నారు.

■ అమరచింత, ఆత్మకూర్, మదనాపూర్ మండలాల్లోని ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాలను డీఈఓ రవీందర్, డీపీఓ సురేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని డీఈఓ పేర్కొన్నారు. వీరి వెంట అమరచింత, ఆత్మకూర్ తహసీల్దార్లు సింధూజ, చాంద్‌పాషా ఉన్నారు.

క్లుప్తంగా

అక్క అంత్యక్రియలకు వచ్చి తమ్ముడి మృతి



కుమురాబేగం (ఫైల్)



మహ్మద్ బషీర్ (ఫైల్)

అడ్డాకుల: అక్క అంత్యక్రియలకు వచ్చిన తమ్ముడు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన మూసాపేట మండల కేంద్రంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుబురాబేగం(90)కు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బుధవారం సాయంత్రం మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చిన్న కుమారుడి వద్ద ఉండే ఆమె తమ్ముడు మహ్మద్ బషీర్(86) గురువారం అక్క అంత్యక్రియల్లో పాల్గొనడానికి మూసాపేటకు వచ్చాడు. జాతీయ రహదారి వద్ద బస్సు దిగిన కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రోడ్డు పక్కన ఉన్న ఇంటి వద్ద కూర్చొని గుండెపోటుకు గురై కిందపడి ప్రాణాలు వదిలాడు. స్థానికులు సీపీఆర్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బషీర్ మృతదేహాన్ని మూసాపేటలోని వారి సొంతింటికి తీసుకెళ్లారు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడు నజిరోద్దీన్ టీఎస్ఎస్‌పీలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా గురువారం మధ్యాహ్నం అక్క అంత్యక్రియలు నిర్వహించగా రాత్రి 8గంటలకు తమ్ముడి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సంఘటనతో మూసాపేటలో విషాదం నెలకొంది.

వేధింపులు తాళలేక వ్యక్తి బలవన్మరణం



రాములు (ఫైల్)

అమరచింత: వేధింపులు తాళలేక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం ఆత్మకూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూర్ మండలంలోని వీరరాఘవ పురం చిన్నపాగ రాములు (33)కు తన తల్లి నర్సమ్మకు చెందిన భూమి వారసత్వంగా వచ్చింది. వీటిలో కొంత నాన్నమ్మ అయిన నాగమ్మకు ఇవ్వాలని మృతుడి మేనత్తలు అతనితో తరచూ గొడవలు పడుతూ వేధించేవారు. దీంతో తీవ్ర మనస్థాపంతో గురువారం తెల్లవారుజామున తన భార్య భాగ్యమ్మతో గుబులుగా ఉందని చెప్పి, ఆమెను తన తల్లిదండ్రుల ఇంటికి బలవంతంగా పంపించాడు. గురువారం తెల్లవారుజామునా బయటికి బైక్‌పై వచ్చిన రాములు శ్రీరామ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

నిప్పంటుకుని వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కుమ్మెరలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మెరకు చెందిన దాసు తన వ్యవసాయ పొలంలో ఎండిపోయిన పత్తి మొక్కలను కాలుస్తుండగా ప్రమాదవశాత్తు ఒంటికి నిప్పంటుకుంది. అక్కడే ఉన్న కుటుంబసభ్యులు గమనించి ఆయనను జిల్లాకేంద్రంలో జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలం



- కరోనా తర్వాత జీవనశైలిలో మార్పు
- రోగాల బారిన 35నుంచి 50ఏళ్ల లోపు వారే అధికం
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

పాలమూరు: కరోనా తర్వాత అందరి ఆరోగ్యంపై పలు రకాల ప్రభావాలు కన్పిస్తున్నాయి. కరోనా కంటే ముందు ఆరోగ్య సమస్యలు ఒక మాదిరి ఉంటే వచ్చిన తర్వాత ఆరోగ్య సమస్యలు పెరిగాయి. కొత్త రకం వైరస్‌లతో జనాలు సతమతం అవుతున్నారు. ఇప్పటికి కూడా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఏదో రకమైన ఆరోగ్య సమస్య వేధిస్తుంది. ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు కలరపెడుతున్నాయి. దీనికితోడు శారీరక వ్యాయామం లేకపోవడం. వేళకు తినకపోవడం, మద్యం, పొగ తాగడం, ఒత్తిళ్లు చివరికి గుండెపోటుకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా మధుమేహం, రక్తపోటు, కిడ్నీ సమస్య, స్థూలకాయం, గుండె నొప్పిలాంటి సమస్యలతో జిల్లావాసులు సతమవుతున్నారు. నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో అధిక రక్తపోటు నమోదు

18ఏళ్లు పైబడిన వారిలో సగటున 20శాతం మంది అధిక రక్తపోటు బాధితులే. వీరిలో రక్తపోటు 140/90గా గుర్తించారు. జిల్లాలో రక్తపోటు వచ్చిన వారు 22శాతం, మధుమేహం వచ్చిన వారు జిల్లాలో 6.8శాతం, కిడ్ని సమస్యతో బాధపడుతున్న వారు 11శాతం ప్రజలు ఉన్నారు. ముఖ్యంగా చిన్నారులలో చాలా మంది స్థూలకాయంతో బాధపడుతున్నారు.

ప్రతి ఐదుగురిలో ఒకరు..

జిల్లాలో ప్రజల జీవన శైలి కారణంగా మధుమేహ బాధితుల సంఖ్య భారీగా పెరుగుతోంది. జిల్లాలో పాతికేళ్లు దాటిన ప్రతి ఐదుగురిలో ఒకరు మధుమేహం బాధితులున్నారని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 2లక్షల వరకు బాధితులుంటారని అంచనా.

చిన్న నాటి నుంచే మార్పులు..

అధిక రక్తపోటు, మధుమేహం రావడానికి శారీరక శ్రమ లేకపోవడం, కొవ్వు పదార్థాలున్న ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం, మానసిక ఒత్తిడి, మద్యపానం మూల కారణాలు అయ్యే అవకాశం ఉంది. కొందరిలో వంశపారంపర్య కారణాల వల్ల కూడా యుక్త వయసులోనే రక్తపోటు, మధుమేహం రావడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. చాలా గ్రామాల్లో పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులు, మరోవైపు భారీకాయులనూ అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. బాల్యంలో మితిమీరిన బరువు పెరగడం వల్ల యవ్వనంలోనే జీవనశైలి జబ్బులొచ్చి పడుతున్నాయి.

అలస్యమైతే ఏమవుతుందంటే..

సాధారణ మనిషి రక్తంలో గ్లూకోజ్ 70మిల్లీ గ్రాములుంటుంది. అంతకంటే ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బందులు వస్తాయి. 30మిల్లీగ్రామాలకు పడిపోతే మనిషి స్పృహ తప్పి పడిపోతాడు. మధుమేహం ఉందంటే ఆ మనిషి రక్తంలో గ్లూకోజ్ అధికంగా ఉన్నట్లు. సాధారణం కంటే తగ్గితే ఎక్కువ ప్రమాదం. ఉదయం 8గంటల వరకు అల్పాహారం తీసుకుంటారు. వారు ఏమీ తినకముందే ఉదయం 7గంటలకు ముందు బిళ్ల వేసుకుంటారు. అది రెండుగంటల తర్వాత పని చేయడం ప్రారంభం చేస్తుంది. మొత్తానికి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దాని ప్రభావం ఉంటుంది. ఆ సమయం దాటితే గ్లూకోజ్ స్థాయి తగ్గి చేతులు, కాళ్లు వణుకుతాయి. తలలో చెమటలు పడతాయి మైకంగా ఉండి నిద్ర ముంచుకొస్తుంది. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రతి 2–3గంటలకు ఒకసారి ఏదో ఒక రూపంలో ఆహారం తీసుకుంటూ ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తేలిగ్గా జీర్ణమయ్యే వాటిని తీసుకోవాలి



రక్తంలో షుగర్ శాతం పడిపోకుండా ఉండేందుకు తేలిగ్గా జీర్ణమయ్యే పాలు, అరటిపండ్లు, పంచదారతో కూడిన టీ, కాఫీ లాంటివి తీసుకోవాలి. టీ, కాఫీ వల్ల అరగంట వరకు ఆగుతుంది. అరటిపండు గంటపాటు గ్లూకోజ్ పడిపోకుండా నిలువరిస్తుంది. మనిషిలో గ్లూకోజ్ స్థాయి పడిపోతుంటే ఆ ప్రభావ సూచనలు తెలుస్తాయి. వెంటనే ఏదో ఒక ఆహారం తీసుకోవాలి.

– బాల శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్

అయోడిన్ లోపం వల్ల కలిగే దుష్పలితాలు

జీవన క్రియలకు అవసరమైన మూలకాల్లో అయోడిన్ ఒకటి. దీని లోపం వల్ల గాయిటర్, బుద్ధి మాంద్యం, స్త్రీలల్లో గర్భస్రావం, అలసట, చికాకు కోపం వంటివి సంక్రమిస్తాయి. అయోడిన్ అవటుగ్రంథి, కాలేయం పిట్యూటరీ గ్రంథులపై ప్రభావాన్ని చూపుతుంది. కీలక సమయాల్లో ఎంజైములను చైతన్యవంతం చేస్తుంది. అయోడిన్ లోపం వల్ల అవటు గ్రంథి పనితీరు తగ్గుతుంది. ఇది జీవనక్రియల మీద ప్రభావాన్ని చూపుతుంది. ఇది తీవ్రమైతే అవటు గ్రంథి పెరుగుతుంది. ఫలితంగా మెడభాగంలో ఉబ్బెత్తుగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాపాయంగా పరిణమిస్తుంది.

చింతలముని రంగస్వామి ఆభరణాల ఊరేగింపు

అమరచింత: చింతల మునిరంగస్వామి ఆభరణాలను మేళతాళాలు భాజాభజంత్రీల నడుమ ఆలయ అధికారులు తరలించారు. మండలంలోని నందిమళ్లలో గురువారం నుంచి ఆదివారం వరకు జరిగే జాతర సందర్భంగా స్వామి వారి అభరణాలను ఆత్మకూర్ ఎస్‌బీఐ బ్యాంకు నుంచి గ్రామానికి తరలించారు. గురువారం సాయంత్రం తీర్థావళి, శుక్రవారం సేవ, ఆరాదన, అర్చనతో పాటు రాత్రి 11.35 గంటలకు ప్రభోత్సవం, శనివారం రాత్రి 1.20 గంటలకు రథోత్సవం, పల్లకీసేవ నిర్వహించనున్నారు. అభరణాల తరలింపులో నాగరాజ్ గౌడ్, అయూబ్‌ఖాన్, రాచాల రాజు, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ రెడ్డి, రాజు, సుధాకార్, చిత్తనూర్ వెంకట్‌రెడ్డి, గోవిందు, మహేందర్ రెడ్డి, అరుణ్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పాన్‌గల్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న పల్లె దవాఖానాలను గురువారం ఆయుష్మాన్ భారత్ రాష్ట్ర పరిశీలకులు యశ్వంత్ తదితరులు పరిశీలించారు. పాన్‌గల్, కేతేపల్లి, అన్నారం, వెంగళాయిపల్లి, తెల్లరాళ్ళపల్లిలో వారు సందర్శించి పల్లె దవాఖానా భవనాల కలర్లు, బ్రాండింగ్,లోగోలను పరిశీలించారు. ఆయా సబ్ సెంటర్ల పరిధిలో ఏర్పాటు చేయనున్న పల్లె దవాఖానాలు శుభ్రమైన వాతావరణంలో ఉంటూ అన్ని ఆరోగ్య కార్యక్రమాలను అమలు పర్చాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని అప్పుడే పల్లె దవాఖానాలపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందన్నారు. మండలంలోని ఆయా పల్లె దవాఖానాలను త్వరలోనే కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డేటా మేనేజర్ వెంకట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి బలవన్మరణం



జాతరలో ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు



నాగప్ప (ఫైల్)

మద్దూరు: బావాజీ జాతరలో పనిచేయడానికి వచ్చిన పంచాయతీ కార్మికుడు చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు గిరిజనుల జాతర గురులోకామా సంద్ ప్రభు ఉత్సవాల్లో ఏర్పాట్లకు దారమగిద్ద మండలంలోని 60 మంది పంచాయతీ కార్మికులను ఇక్కడ పనిలో పెట్టారు. అందులో దామరగిద్దకు చెందిన నాగప్ప(34) కూడా ఉన్నాడు. బుధవారం దామరగిద్దకు చెందిన పంచాయతీ కార్మికులు జాతర వద్దకు చేరుకుని అధికారులు చెప్పిన పనులు చేశారు. ఈ క్రమంలో దగ్గర గ్రామాలున్న కార్మికులు వెళ్లిపోగా ఇతనితో పాటు మరికొంత మంది ఇక్కడే ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం షిఫ్టులో పనిచేసే నాగప్ప కనిపించకపోవడంతో వెతికారు. గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. దగ్గరికి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందడంతో అక్కడే ఉన్న పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జిల్లా కేంద్రానికి పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. నాగప్ప మద్యానికి బానిస కావడంతో తరుచూ ఇంట్లో గొడవలు అయ్యేవని, దీనికి తోడు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు రావడంతో నాగప్పను నెల రోజులు మద్యం మాన్పించినట్లు భార్య తెలిపింది. దీంతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

పంచాయతీ కార్మికుడు మృతి చెందిన విషయం తెలియడంతో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.నర్సింహ, ప్రజాపంథా నాయకుడు నర్సింహులు తదితరులు అక్కడికి చేరుకొని ధర్నా చేపట్టారు. ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం వల్లే నాగప్ప మృతి చెందాడని ఆరోపించారు. ఇప్పటికీ పంచాయతీ కార్మికులకు 4 నెలల వేతనాలు అందాల్సి ఉందన్నారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న దామరగిద్ద ఎంపీఓ నర్సప్ప కార్మికులకు, నాయకులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు.

గాయాలతో పరీక్షకు హాజరైన విద్యార్థి

- కుక్కను తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడిన తండ్రీకూతురు

ఉండవెల్లి: కూతురిని పదో తరగతి పరీక్ష కేంద్రానికి బైక్‌పై తీసుకెళ్తుండగా కుక్కను తప్పించబోయి తండ్రీకూతురు గాయాలపాలైన సంఘటన మండలంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అలంపూర్ మండలం గొందిమళ్లకు చెందిన పదో తరగతి విద్యార్థిని అఖిలారెడ్డి పరీక్ష కేంద్రం ఉండవెల్లి మండల కేంద్రంలోని పడింది. ఈ క్రమంలో ప్రతి రోజు బుక్కాపురం వరకు తండ్రి రంగారెడ్డి బైక్‌పై దింపేసి, అటు నుంచి ఆటోలో ఉండవెల్లికి వెళ్లేది. గురువారం కూడా తండ్రి కూతు రిని బుక్కాపురం వరకు వదిలేందుకు బైక్‌పై వస్తుండగా కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి ఇద్దరు కిందపడి గాయాలపాలయ్యారు. రంగారెడ్డిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని అఖిలారెడ్డికి కంటి కింద, గడ్డానికి స్వల్ప గాయాలు కాగా, ఉండవెల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎస్ఎం చేత ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థి పరీక్షకు హాజరైంది. పరీక్ష పూర్తయిన తర్వాత విద్యార్థినిని కూడా కర్నూల్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



కాల్వ పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పర్దీపూర్‌లో రిజర్వాయర్ ఆయకట్టు కింద ఆనకట్ట, ఉంద్యాల ఫేజ్–1 నుంచి చెరువులకు నీటిని నింపేందుకు కాల్వ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే బండ్రపల్లి సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మించిన కామన్ హాల్, కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో అతిథి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నచింతకుంట ఊకచెట్టు వాగుపై నిర్మిస్తున్న కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి చెరువులను నీటితో నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే చిన్నచింతకుంట ఊకచెట్టు వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి మండలంలోని ప్రతి చెరువును నీటితో నింపుతామన్నారు. ఊకచెట్టువాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం, కాజ్‌వే పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బండ్రపల్లి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, సర్పంచ్ మోహన్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, మన్నెం గౌడ్, సురేందర్‌రెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

స్టార్టర్ మరమ్మతు చేస్తుండగా.. విద్యుదాఘాతంతో రైతు మృతి

పెబ్బేరు: మండలంలోని తోమాలపల్లిలో గురువారం విద్యుదాఘాతంతో నీలం సుధాకర్ (50) మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలం సుధాకర్ తమ చీని తోటలో నీళ్లు పెట్టేందుకు సాయంత్రం వెళ్లాడు. మోటార్ స్టార్టర్‌ను మరమ్మతు చేస్తుండగా అకస్మాత్తుగా షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం వెళ్లిన వ్యక్తి ఇంటికి రాలేదని రాత్రి 8 గంటలకు కుమారుడు రామకృష్ణ పొలం వద్దకు వెళ్లి చూడగా విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించారు.

ప్రాణం తీసిన అతివేగం

- డివైడర్‌ను ఢీకొన్న బైక్, బీటెక్ విద్యార్థి మృతి
- మృతుడు వనపర్తి జిల్లా రేవల్లి వాసి

ఇబ్రహీంపట్నం: అతి వేగం ఓ విద్యార్థి ప్రాణం తీసింది. బైక్‌ను వేగంగా నడుపుతున్న క్రమంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి గేట్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన కే శివకుమార్‌రెడ్డి(22) బీ జశ్వంత్‌రెడ్డి స్నేహితులు. చింతపల్లిగూడ పరిధిలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుకుంటూ బీఎస్‌రెడ్డి నగర్‌లో గల హాస్టల్ ఉంటున్నారు. వీరు నగరం నుంచి ఇబ్రహీంపట్నం వైపు బైక్‌పై వస్తుండగా మంగల్‌పల్లి క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శివకుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. జశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అడ్డాకుల: పురుగుల మందు తాగిన ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన రాచాలలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల గోవిందమ్మ(38), వెంకటయ్య దంపతులు. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. జీవితంపై విరక్తి చెందిన గోవిందమ్మ ఈనెల 2న పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృత్యువాత

చిన్నచింతకుంట: మండలంలోని దాసర్‌పల్లికి చెందిన కుర్వ బాల్‌రాజు తన గొర్రెలను గురువారం ఉదయం మేతకు తీసుకెళ్లి, అందులోని కొన్ని గొర్రెపిల్లలను ఆశిరెడ్డి పొలంలో వలవేసి ఉంచాడు. ఎవరూ లేని లేని సమయంలో కుక్కలు గొర్రెలపై దాడి చేయగా, 30 గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి బాల్‌రాజు కన్నీరు మున్నీరయ్యాడు.



దోపిడీకి గురవుతున్న తెలంగాణ

- బీఆర్‌ఎస్‌ను గద్దెదించాలి
- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ



మాట్లాడుతున్న ఆకునూరి మురళీ

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలంగాణ సంపదను దోచుకుంటున్నారని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళీ ఆరోపించారు. 21రోజుల పాటు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా సాయంత్రం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో ముగింపు సభను నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్, సోషల్ డెమోక్రసీ ఫోరం కో కన్వీనర్ సంఘంరెడ్డి పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళీ మాట్లాడారు. గద్వాలలో ఒక్కసారి ఎమ్మెల్యే గట్టుభీముడు అయ్యారని, ఆతర్వాత నుంచి గడీల పాలన కొనసాగుతుందన్నారు. మనది ఛాలా ధనిక రాష్ట్రమని, కానీ ప్రభుత్వ బడులు దీన స్థితిలో ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో హైదరాబాద్, కృష్ణానది, గోదావరి నదులు ఉన్నాయని, బొగ్గు గనులు, ఐటీ పరిశ్రమల ద్వారా సంపద వస్తుందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ పేరుతో గద్దెనెక్కి, ఇప్పుడు తెలంగాణ పేరు తీసి భారత రాష్ట్ర సమితి పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబ రాష్ట్ర సంపదను రూ.వేల కోట్లు దోచుకుని విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రం పన్నుల్లో నుంచి 50శాతం కేంద్రానికి పోతాయని, కేంద్ర ప్రభుత్వం వైద్యం, విద్యలో రాష్ట్రానికి కేటాయించకుండా, బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్‌ను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వాదించాలని, బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు.

చేనేత బతుకులు ఆగమ్యగోచరం

గద్వాల చీరలు దేశా వ్యాప్తంగా పేరు గాంచాయని, కానీ చేనేత కార్మికుల బతుకులు ఆగమ్యగోచరంగా మారాయని సోషల్ డెమోక్రసీ ఫోరం కో కన్వీనర్ సంఘంరెడ్డి పృథ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్ర బొంద పెట్టే ప్రయత్నం చేసేందుకు ఆంధ్రా నాయకుల పేర్లు ప్రస్తావించాల్సిన అవసరం లేదన్నారు. ఆంధ్రా పాలకుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడి శ్వాస విడిచిన సర్వారెడ్డి పేర్లు ప్రస్తావించాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలో వచ్చిన తర్వాత కూడా 7వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. 70ఏళ్ల తర్వాత ఇప్పటికీ అక్షరాస్యతలో వెనుకబడిన మండలం గట్టు అన్నారు. గతంలో జిల్లా ప్రభుత్వాసుత్రి సందర్శించామని, సరైన వైద్యం అందడం లేదని, రోగులకు ఇంజక్షన్లు దుస్తులపై నుంచే చేస్తున్నారని మండిపడ్డారు.

నడిగడ్డలో కుటుంబ పాలనకు చరమగీతం:

70ఏళ్ల కుటుంబ పాలనలో నడిగడ్డ విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధిలో వెనుకబాటుతనానికి గురైందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ విమర్శించారు. గత నెల 17న ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టామన్నారు. నడిగడ్డ ప్రాంతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను ఎదగనీయకుండా అణిచివేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో 40వేల మంది పత్తిని సాగు చేస్తున్నారని, 40మంది సీడ్ ఆర్గనైజర్లు వారిని దోపిడి చేస్తున్నారని, దీనిపై పోరాటం చేస్తామన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమ దందాలు, సెటిల్‌మెంట్లు, భూ దందాలు చేస్తున్నారని, దీనిని బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. బహుజనులను చైతన్యం చేస్తూ నడిగడ్డలో కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయనం ఆసన్నమైందన్నారు.

బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారు

గ్రామ సమస్యలు చెప్పామని వామన్‌పల్లి పంచాయతీకి బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు భార్య సంధ్య సభలో తెలిపారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.10లక్షల అప్పు అయ్యిందని, పంచాయతీలో సైతం నిధులు లేవని, గ్రామంలో అభివృద్ధి చేయడం లేదని తమను గ్రామస్తులు నిలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులపై ఎమ్మెల్యేని అడిగితే తమను అడగవద్దని, నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్ కుమార్‌కు అడగాలని సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఇదేనా.. న్యాయం అంటూ మండిపడ్డారు.



హాజరైన ప్రజలు

క్లుప్తంగా...

కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ మొదలుపెడతామని చెప్పారు

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చారన్న ఎంపీ ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నాళ్లగానో పెండింగ్‌లో ఉన్న కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ పనులను మొదలు పెడతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఉత్తమ్ పార్లమెంట్‌లో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. డోర్నకల్ - నేలకొండపల్లి - కోదాడ - హుజూర్ నగర్ - నేరేడుచర్ల - మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని కోరారు. దీంతో పాటే మోతమర్రి-జగ్గయ్యపేట-మేళ్లచెర్వు-మఠంపల్లి-జాన్ పహాడ్-విష్ణు పురం-మిర్యాలగూడ రైల్వే లైన్‌లో ప్యాసింజర్ రైళ్లను నడపాలని, ఈ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలని కోరారు.

వందేభారత్‌ను నల్లగొండలో ఆపుతామని హామీ

మోతుమర్రి-మిర్యాలగూడ మధ్య ప్యాసెంజర్ రైళ్లను నడుపుతామని, డబ్లింగ్ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. విశాఖ- తిరుపతి వందేభారత్‌తో పాటు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నల్లగొండలో ఆపేలా చర్య లు తీసుకుంటామని, మిర్యాలగూడలో ఆపే విషయంపై పరిశీలన చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు.

టీఎస్‌పీఎస్సీ కేసులో కేటీఆర్‌ను విచారించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీకేజీ అంశాన్ని పక్కదారి పట్టించే కుట్రలో భాగంగానే బండి సంజయ్ అరెస్టుతో పాటు రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. 30 లక్షల కుటుంబాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని విచారిస్తే మంత్రి కేటీఆర్ బండారం బయటపడుతుందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ కేసులో కేటీఆర్‌ను సైతం విచారించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ, మంత్రి కేటీఆర్ సిఫారసుతోనే టెక్నికల్ సర్వీసెస్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఏపీ సర్వీసులో ఉన్న ఏ2 ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీలో అక్రమంగా చొరబడి పేపర్ లీకేజీకి తెరతీశారని ఆరోపించారు. టెక్నికల్ సర్వీసెస్ చైర్మన్ జగన్మోహన్ రావు మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడని అన్నారు. మంత్రి కేటీఆర్‌ను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అది వదిలేసి రేవంత్‌రెడ్డి, సంజయ్‌పై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్న బండి సంజయ్‌ను అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు.

అవును.. మళ్లించాం

▶ మొదటి పేజీ తరువాయి

చట్టం తమకు వర్తించదని దబాయించడం రామోజీరావు, ఆయన కుటుంబం బరితెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది. సీఐడీ అధికారులకు రికార్డులు చూపించబోమని శైలజా కిరణ్ భీష్మించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజను సీఐడీ అధికారులు గురువారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని ఆమె నివాసంలో విచారించారు. సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్, విచారణ అధికారి రవికుమార్‌లతోపాటు 25 మంది అధికారుల బృందం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విచారించింది. శైలజ తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయవాదులతోపాటు తెలంగాణ హైకోర్టు న్యాయవాది కూడా విచారణ ప్రక్రియ సమయంలో ఉన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన విచారణ ప్రక్రియను సీఐడీ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. దాదాపు 75 ప్రశ్నలకు వివరాలు రాబట్టి వాంగ్మూల పత్రంపై శైలజ సంతకం తీసుకున్నారు. గతంలో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా శైలజ నుంచి పలు కీలక విషయాలను సీఐడీ అధికారులు రాబట్టినట్టు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం విచారణలో ఆమె వెల్లడించిన విషయాలు ఇలా ఉన్నాయి...

చందాదారుల సొమ్మును మళ్లించాం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీల్లో సేకరించిన పలు కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ సీఐడీ అధికారులు శైలజను విచారించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను రామోజీ గ్రూపునకు చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ (కర్ణాటక)- బెంగళూరు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్-చెన్నైలలో అక్రమ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్న విషయాన్ని ఆమెకు చూపించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏకంగా 88.5 శాతం వాటా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిటే ఉంది. ''అవును.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులను ఆ కంపెనీల్లో పెట్టుబడి పెట్టాం..'అని శైలజ అంగీకరించినట్లు సమాచారం.

ఏ చట్టాలు వర్తించవు... మా చట్టం మాకుంది

చందాదారులు చెల్లించిన నిధులను ఇతర కంపెనీలకు మళ్లించడం కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982కు వ్యతిరేకం కదా...! ఆ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం అందుకు రెండేళ్లు జైలు శిక్ష పడుతుందని తెలుసు కదా..? అని సీఐడీ అధికారులు శైలజను ప్రశ్నించారు. అయితే అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తనకు తెలియదని ఆమె చెప్పడంతో సీఐడీ అధికారులు విస్తుపోయారు. చిట్‌ఫండ్స్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మీకు అసలు చిట్‌ఫండ్స్ చట్టమే తెలియదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. చిట్‌ఫండ్స్ చట్టం- 1982ను తాము అనుసరించబోమని ఆమె సమాధానం ఇవ్వడంతో నివ్వెరపోవడం సీఐడీ అధికారుల వంతైంది. మరి చిట్‌ఫండ్స్ వ్యాపారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించగా.. మా చట్టాలు మాకున్నాయి... వాటి ప్రకారం చేస్తున్నాం అని ఆమె బదులిచ్చినట్లు సమాచారం.



గురువారం హైదరాబాద్‌లో శైలజా కిరణ్‌ను విచారిస్తున్న సీఐడీ అధికారులు

చట్టం అనుసరిస్తామంటూ...తెలీదంటూ

సీఐడీ అధికారులు అదే విషయంపై గుచ్చిగుచ్చి ప్రశ్నించడంతో తాము కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నామని శైలజ పేర్కొనట్లు సమాచారం. చిట్‌ఫండ్స్ వ్యాపారానికి కంపెనీల చట్టంతో నిమిత్తం లేదని, అనుసరించాల్సింది కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం -1982 కదా? అని అధికారులు ప్రశ్నించగా ఆమె సమాధానం ఇచ్చేందుకు నిరాకరించినట్టు తెలుస్తోంది. పోనీ కంపెనీల చట్టాన్ని అనుసరిస్తున్నారని భావించినా... ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5 శాతం వాటాతోపాటు మరో రెండు కంపెనీల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ పెట్టుబడులు పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు కదా? అని అధికారులు ప్రశ్నించడంతో అవునని ఆమె సమాధానమిచ్చారు. కంపెనీల చట్టం ప్రకారం 50 శాతానికి మించి వాటా కలిగి ఉంటే అనుబంధ కంపెనీగానే పరిగణిస్తారు కదా? అని తిరిగి ప్రశ్నించగా అందుకు కూడా ఆమె అవుననే సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది.

ఏటా రూ.వందల కోట్ల చెక్కులు..

విచారణ సందర్భంగా సీఐడీ మరో కీలక ఆధారాన్ని సేకరించింది. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తున్న రామోజీరావు, శైలజ రికార్డుల్లో మాత్రం చట్టాన్ని ఏమార్చేందుకు యత్నించారని నిరూపితమైంది. 2022 మార్చి 31న రూ.255 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ చెక్కులేవీ తరువాత నగదుగా మారినట్లు (ఎన్‌క్యాష్)గా రికార్డుల్లో లేవని సీఐడీ అధికారులు గుర్తించారు. గరిష్టంగా పది రోజుల్లో చెక్కులను నగదుగా జమ చేస్తామని శైలజ పేర్కొన్నారు. మరి గతేడాది మార్చి 31న వచ్చినట్లు చూపించిన రూ.255 కోట్ల చెక్కులేవీ నగదుగా మారినట్లు రికార్డుల్లో ఎందుకు లేవని సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజ తెల్లమొహం వేశారని సమాచారం. కొన్ని దశాబ్దాలుగా ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు రికార్డుల్లో చూపుతున్నా అవి నగదుగా మాత్రం మారడం లేదు. ఎందుకంటే ఏటా చందాదారులు చెల్లిస్తున్న రూ.వందల కోట్లను మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా సొంత ప్రయోజనాలకు మళ్లిస్తోంది. ఆర్థిక సంవత్సరం చివరిలో ఆ నిధులు ఉన్నట్లుగా చూపించాల్సి రావడంతో చెక్కులు వచ్చినట్లు చూపించి కనికట్టు చేస్తోంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు.

ఉన్నాయి కానీ.. చూపించను

లేని చెక్కులు ఉన్నట్టుగా చూపించి మోసానికి పాల్పడినట్టు నిరూపితం కావడంతో శైలజ షాక్‌కు గురయ్యారు. దాంతో సీఐడీ అధికారులను పక్కదారి పట్టించేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. 'ఆ చెక్కుల సమాచారం అంతా ప్రధాన కార్యాలయంలో ఉంటుంది... 'అని పేర్కొన్నారు.

ఏపీ రికార్డులు ప్రత్యేకంగా లేవు

చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు ఏ రాష్ట్రానికి సంబంధించిన రికార్డులు ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా నిర్వహించాలి. అక్కడి చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, చిట్టీల వివరాలు, ఆదాయ-వ్యయాలు, బ్యాలన్స్‌షీట్‌ను ప్రత్యేకంగా రూపొందించాలి. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ చందాదారులు చెల్లిస్తున్న మొత్తం, ఇతర వివరాలను తెలంగాణ, ఇతర రాష్ట్రాల రికార్డులతో పాటు కలిపి నిర్వహిస్తోంది. ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. రామోజీరావు కుటుంబానికి చెందిన ఇతర కంపెనీల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడుతోంది.

నీళ్లు నమిలి... నీళ్లు తాగి

సీఐడీ అధికారులు నిబంధనలు పాటిస్తూ శైలజా కిరణ్‌ను విచారించారు. విచారణకు ఆమె సహకరించకపోయినా సరే ఒత్తిడి చేయకుండా ప్రశ్నలు సంధించారు. గురువారం రోజు మధ్యాహ్నం వరకు సాగిన మొదటి విడతలో చాలా ప్రశ్నలకు నాకు తెలియదు.. గుర్తులేదు...నాకు సంబంధం లేదు అంటూ ఆమె సమాధానాలు దాటవేసేందుకు యత్నించారు. దాంతో చాలా ప్రశ్నలకు ఆమె నీళ్లు నమిలినట్లు సమాచారం. విచారణ సందర్భంగా ఆమె పలుసార్లు తనకు దాహం వేస్తోందంటూ బయటకు వెళ్లి వచ్చారు.

చూపు సరిగా లేదు.. కనిపించడం లేదు

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను ల్యాప్‌టాప్‌లో సీఐడీ అధికారులు శైలజకు చూపించారు. నిధులు మళ్లించినట్టు అందులో ఉన్న వివరాలను చూపిస్తూ అవి వాస్తవమేనా? అని అడిగారు. అయితే ఆ పత్రాలు తనకు కనిపించడం లేదని... పేర్కొనడంతో సీఐడీ అధికారులు ల్యాప్‌టాప్‌లో ఎన్‌లార్జ్ చేసి మరీ చూపించారు. 'నాకు చూపు సరిగా లేదు... ఆ పత్రాల్లో ఏముందో కనిపించడం లేదు'అని శైలజ పేర్కొనడంతో సీఐడీ అధికారులు మధ్యవర్తిగా ఉన్న ఓ వ్యక్తిని పిలిచి ఆ పత్రాలు చూపించారు. అవి తనకు కనిపిస్తున్నాయని ఆయన చెప్పడంతో పాటు అందులో ఏముందో చదివి వినిపించారు. దీంతో తనకు ఏమీ కనిపించడంలేదని తప్పించుకునేందుకు శైలజ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది.

సలేశ్వరం.. జనసంద్రం

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతించిన ప్రకారం లింగమయ్య దర్శనానికి శుక్రవారం చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

యంత్రాంగం ఫెయిల్...

సలేశ్వరం లింగమయ్య జాతర పూర్వం వారం పాటు జరిగేది. ఆ తర్వాత కాలంలో ఐదు రోజుల పాటు నిర్వహణకు అటవీశాఖ అనుమతి ఇవ్వగా కరోనా నేపథ్యంలో 2020, 2021లో ఉత్సవాలు రద్దయ్యాయి. ఆ తర్వాత పరిస్థితులు మెరుగుపడటంతో గతేడాది, ప్రస్తుతం మూడు రోజులకే ఉత్సవాలను అటవీశాఖ కుదించింది. దీంతో భక్తులు లక్షలాదిగా పోటెత్తారు. మరోవైపు టోల్‌గేట్ రుసుము కోసం నిర్దేశిత సమయం దాటినా వేల సంఖ్యలో వాహనాలను అనుమతించడంతో ఉదయం వెళ్లి తిరుగుపయనమైన వారు.. లింగమయ్యను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులతో దారి మొత్తం కిక్కిరిసింది. అలాగే ఆర్టీసీ బస్సుల హాల్టింగ్‌ను రాంపూర్ నుంచి పుల్లాయపల్లికి మార్చడం, మధ్యాహ్నం 3:30 గంటల తర్వాత బస్సులను నిలిపివేయడంతో భక్తులు నరకయాతన అనుభవించారు. తెలంగాణలో అతిపెద్ద సాహస యాత్రగా పేరొందిన గిరిజన జాతరకు అధికార యంత్రాంగం కనీసం ఉచిత తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదని భక్తులు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా కనీస చొరవ చూపలేదంటూ దుయ్యబట్టారు.

దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగా..

లోయలోకి దిగకముందే భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో భయం వేసింది. ఇప్పుడు ఇబ్బంది పడేకన్నా వచ్చే ఏడాదైనా లింగమయ్యను దర్శించుకోవచ్చని.. దూరం నుంచి దండం పెట్టుకొని వెనుదిరిగాను.

- లక్ష్మి, చిన్నకొత్తపల్లి, పెద్దకొత్తపల్లి మండలం

ఒకరిద్దరే పోలీసులు

పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గం వెంట పోలీసు బందోబస్తు లేదు. లోయలోకి దిగే మార్గంలో భక్తులను అదుపు చేసే వారే కరువయ్యారు. స్నానాలు చేసే గుండం దగ్గర ఒకరిద్దరు పోలీసులే ఉన్నారు. **- శివ, జగన్నాథపురం**

భారీ ధరలు

క్షేత్రంలో పలు రకాల వస్తువుల ధరలు విపరీతంగా ఉన్నాయి. లీటర్ నీళ్ల బాటిల్‌ను రూ. 70కి, టెంకాయ రూ. 50కి విక్రయిస్తున్నారు. అయినా అధికారులు ఎవరూ వారిని నియంత్రించలేదు.

- రవీందర్, వనపట్ల, నాగర్‌కర్నూల్ మండలం

చేయని తప్పుకు నన్ను బలిచేశారు

- పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం ఇవ్వండి
- ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి హరీశ్ వేడుకోలు
- విద్యార్థి హాల్‌టికెట్ తీసుకుని బయటికి పంపిన హనుమకొండ డీఈవో



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్, అతని తల్లి లలిత

కమలాపూర్: చేయని తప్పుకు తనను బలిచేశారని పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన విద్యార్థి దండెబోయిన హరీశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఈ నెల 4న హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన ఘటనలో డీబారైన హరీశ్ గురువారం ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు పరీక్షకేంద్రానికి రాగా, డీఈవో ఎండీ అబ్దుల్ హై అతని హాల్‌టికెట్ తీసుకొని బయటకు పంపించారు. అనంతరం హరీశ్ తన తల్లి లలితతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ రోజు పరీక్ష కేంద్రం కిటికీ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి 'తమ్ముడు ప్రశ్నపత్రం ఇవ్వు' అని అడిగాడని, తాను ఇవ్వనని చెప్పి ఇన్విజిలేటర్‌కు చెబుదామనుకుంటున్న సమయంలో ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని తెలిపాడు. తాను బెంచీ మధ్యలోకి జరగగానే అతను వెళ్లిపోయాడని భావించి ఆన్సర్‌షీట్ మార్జిన్ కొట్టుకుంటుండగా ప్రశ్నపత్రం లాక్కున్నాడని, ఫొటోలు తీసుకుని ఆ ప్రశ్నపత్రాన్ని తన వైపు విసిరేసి వెళ్లిపోయాడని పేర్కొన్నాడు. తనను చంపుతానని బెదిరించడంతో భయపడి ఆ విషయం ఎవరికీ చెప్పలేదని తెలిపాడు. చేయని తప్పుకు తన భవిష్యత్‌ను బలి చేయకుండా హాల్‌టికెట్ ఇచ్చి యథావిధిగా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు. కనీసం సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశమైనా ఇవ్వాలని ఉన్నతాధికారులను వేడుకున్నాడు. హరీశ్ తల్లి లలిత మాట్లాడుతూ తన కొడుకు భవిష్యత్‌ను పాడు చేయకుండా పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని రోదిస్తూ చేతులు జోడించి సంబంధిత అధికారులను వేడుకొంది.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి



మాట్లాడుతున్న రాఘవాచారి

చిన్నచింతకుంట: మరికల్ మండలం చిత్తనూర్ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీని వెంటనే రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు రాఘవచారి డిమాండ్ చేశారు. గురువారం చిత్తనూర్ ఇథనాల్ కంపెని వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నాచేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కంపెనీ ఏర్పాటైతే వెలువడే రసాయన వ్యర్థాలు మండలంలోని మన్నెపువాగు, ఊకచెటువాగులో కలిసి వాతావరణం, నీరు కలుషితమవుతాయన్నారు. వాటి వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. అంతేకాక పంటలు పండని పరిస్థితులు నెలకొంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అక్రమంగా ఏర్పాటు చేస్తున్న కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులతో ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సువర్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, రాజారావు, లక్ష్మయ్య, చంద్రశేఖర్, ఖలీల్, సంతోష్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి శాంతిహోమం

బిజినేపల్లి: ప్రకృతి వైపరీత్యాలు ప్రజలపై ప్రభావం చూపకుండా మండలంలోని నందివడ్డెమాన్ జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేకంగా శాంతి హోమం నిర్వహించారు. అష్టోత్తర శనేశ్వర స్వామి పూజలతో పాటు వివిధ తైలాలతో అభిషేకం పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. అనంతరం శనేశ్వరుడి పురవీధుల గుండా ఆలయానికి చెందిన ఎద్దుల బండ్లు, వాహనాలు ఊరేగింపు చేశారు.



శాంతిహోమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు

- ఈనెల 17నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె
- ఉమ్మడి జిల్లా విద్యుత్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వం తమ సమస్యలను ఈనెల 16వ తేదీలోపు పరిష్కరించకుంటే 17వ తేదీ నుంచి సమ్మె చేస్తామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు సాయిబాబ, రత్నాకర్‌రావు అన్నారు. సమ్మె సన్నాహక సమావేశంలో భాగంగా గురువారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా విద్యుత్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 2022 ఏప్రిల్ నుంచి అందాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని కోరారు. సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే 17 నుంచి సమ్మె చేస్తామన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని తమకు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23వేల మంది ఆర్టిజన్లు అతి తక్కువ వేతనానికి పని చేస్తున్నారని, పెన్షనర్లకు మెరుగైన వేతనాలు అందించే కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్ అమలు చేయాలన్నారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని పని చేసే ఉద్యోగులకు సరైన వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం ఉద్యోగులను వేధిస్తోందన్నారు. అనంతరం సమ్మె వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కో చైర్మన్లు శ్రీధర్, కోకన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మెన్‌లు వజీర్, అనిల్, జిల్లా జేఏసీ కన్వీనర్ చంద్రమౌళి, స్వామి, నవీన్‌కుమార్, రామచంద్రనాయక్, చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీనివాసులు, బాలప్రతాప్, మొగులప్ప, బాబ్యానాయక్, వెంకటనారాయణ, పాండు, ప్రవీన్, నారాయణనాయక్, లింగంగౌడ్, సోమశేఖర్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



సమావేశానికి హాజరైన విద్యుత్ ఉద్యోగులు

ముందుచూపు లేని ప్రభుత్వం

- పంటలు కాపాడడంలో విఫలం
- మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ రూరల్: రైతుల పంటలు కాపాడడంలో ప్రభుత్వానికి ముందు చూపు లేదని, ఎండిపోతున్న పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. గురువారం మండలంలోని ఎల్లూరు సమీపంలో ఉన్న కేఎల్ఐ మొదటి లిఫ్టును ఆయన అనుచరులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పంపు హౌస్, కృష్ణానది బ్యాక్ వాటర్‌ను పరిశీలించారు. అనంతరం కేఎల్ఐ క్వాటర్స్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాలలో రైతులు కేఎల్ఐ ప్రాజెక్టు భరోసాతో పంటలు వేసుకున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కృష్ణానదిలో నీరు లేకుండా కరెంట్ ఉత్పత్తికి వాడుతుందని తెలిపారు. ప్రస్తుతం పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని వాపోయారు. ఆనాడు సమైక్య పాలనలో ప్రభుత్వం స్పందించకపోతే హైకోర్టుకు వెళ్లి రైతుల కోసం ప్రాజెక్టు మీద ధర్నా చేసి నీటిని కిందికి వదలకుండా శ్రీశైలం గేట్లను ఆపి వేయించామని గుర్తు చేశారు. ఇప్పుడు మన తెలంగాణ ప్రభుత్వం రైతుల పొట్టకొట్టే విధంగా కరెంట్ కోసం నీటిని కిందికి వదిలి నదిలో నీళ్లు లేవని చేతులెత్తేస్తే రైతులు ఎవరికి చెప్పుకోవాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా నాగార్జుసాగర్ నుంచి శ్రీశైలంకు రివర్స్ పంపింగ్ చేసి పంటలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీరు తెచ్చి రైతులకు నష్టం కాకుండా చూడాలన్నారు. మంత్రులు, నాయకులు గొప్పగొప్ప మాటలు చెప్పడమే కానీ చేసేదేమీ లేదని ఎద్దేవ చేశారు. కరెంట్ కోసం నీటిని వదలొద్దని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపినా కూడా పది రోజుల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తుండడంతో 30 టీఎంసీలకు పైగా నీటిని వాడుకున్నారన్నారు. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కలిసి 70 నుంచి 80 టీఎంసీల నీటిని కరెంట్ కోసం వాడుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంటలను కాపాడాలని కోరారు. లేకుంటే ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు.



కేఎల్ఐ వద్ద మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

1,019 అడుగులనీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం 1,019అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వ ద్వారా 857 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ఇచ్చిన హామీ నెరవేరుస్తాం

- రేపు 167కే జాతీయ రహదారి పనులకు ప్రధాని శంకుస్థాపన
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు వెల్లడి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొల్లాపూర్‌కు జాతీయ రహదారి, సోమశిల బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తామని నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జాతీయరహదారి, వంతెన నిర్మాణాలు ప్రారంభం కాబోతున్నందుకు సంతోషంగా ఉందని వెల్లడించారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు వయా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా నిర్మించబోయే 167కే జాతీయ రహదారి పనులకు ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. కల్వకుర్తి నుంచి సోమశిల వరకు 86 కి.మీ. మేరకు రహదారి కోసం కేంద్రం రూ.629 కోట్లు కేటాయించి, టెండర్లు కూడా పూర్తి చేసిందన్నారు. శనివారం ప్రధాని రాష్ట్రానికి వచ్చి పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు చేస్తారని వెల్లడించారు. త్వరలోనే ఐకాన్ బ్రిడ్జి, టూరిజం పార్కు పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విచ్చేస్తారని తెలిపారు. సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, కృష్ణ, సత్యనారాయణగౌడ్ తదితరులున్నారు.

విద్యార్థి మృతికి కారణమైన వారిని శిక్షించాలి

కొల్లాపూర్: మన్ననూరు ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థి నిఖిత మృతికి కారణమైన వారిని శిక్షించాలని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కాగా ఈనెల 8వ తేదీన హాజీపూర్ వద్ద శ్రీశైలం హైవే ముట్టడి, 16వ తేదీన చలో అచ్చంపేట కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాదగిరి మాదిగ వెల్లడించారు. ఈ కేసులో హంతకులకు మద్దతుగా నిలుస్తున్న రాజకీయ నాయకులకు తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో శివానందం, కృష్ణ, బాలపీరు, శ్రీనివాసులు, లచ్చగౌడ్, వెంకట్రాములు, దాసు, రాములు, సహదేవుడు, లక్ష్మణ్, అర్జున్, బుగ్గస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

కల్యాణ వైభోగమే..



అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి



మంగళ సూత్రాన్ని చూయిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజు స్వామివారి ఈ వేడుకను చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అందులోభాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుండి స్వామివారిని ఊరేగింపుగా కల్యాణ మంటపం వరకు తీసుకువచ్చారు. అనంతరం భక్తుల సమక్షంలో వేద మంత్రాల మధ్య కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.